www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 డిసెంబర్ 2024


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నేతలు

పోరాటాలతోనే.. హక్కుల సాధన

- పోలవరం పునరావాసం పది శాతమే పూర్తి
- ప్రాజెక్టు డిజైన్లు, అంచనాలపైనే పాలకుల దృష్టంతా
- భూమే అన్ని సమస్యలకూ పరిష్కారం
- పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలతో ప్రత్యేక జిల్లా ప్రకటించాలి
- సిపిఎం జిల్లా 26వ మహాసభ ప్రారంభం సందర్భంగా బహిరంగ సభలో నేతలు
- తొలిరోజు భారీ ప్రదర్శన, నినాదాలతో దద్దరిల్లిన ఏజెన్సీ పురిటిగడ్డ

ప్రదర్శన అగ్రభాగాన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, బుట్టాయగూడెం

పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని, లేకపోతే పాలకులు సామాన్య ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేదని, కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని పలువురు నేతలు అన్నారు. మూడు రోజులపాటు జరగనున్న సిపిఎం ఏలూరు 26వ జిల్లా మహాసభలో భాగంగా తొలిరోజు శుక్రవారం మండల కేంద్రమైన బుట్టాయగూడెంలోని కన్నాపురం రోడ్డులో పెట్రోల్ బంకు దగ్గర నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర భారీ ప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలో జిల్లా, రాష్ట్ర నాయకులు అగ్రభాగాన నిలిచారు. జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు, ఏజెన్సీ ప్రాంతం నుంచి పెద్దఎత్తున మహిళలు తరలొచ్చారు. గిరిజన నృత్యాలు, విల్లంబుల ప్రదర్శన, డప్పు వాయిద్యాలు వంటి అనేక కార్యక్రమాలతో అత్యంత ఉత్సాహభరితంగా ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా 'జిందాబాద్ సిపిఎం, వర్ధిలాల్లి భూపోరాటాలు, వర్ధిలాల్లి ఎర్రజెండా, పోడు భూములకు పట్టాలివ్వాలి, ఎల్‌టిఆర్ భూములకు పట్టాలివ్వాలి, గిరిజనులపై తప్పుడు కేసులు ఆపాలి, 1/70 చట్టం అమలు చేయాలంటూ సిపిఎం కార్యకర్తలు, నాయకులు నినదించారు. మార్గమధ్యంలో అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పూలమాల వేశారు. అనంతరం అక్కడి నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. సినిమా హాల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పెద్దసంఖ్యలో జనం చేరుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఎ.రవి అధ్యక్షోపన్యాసం ఇచ్చారు. ఆదివాసీల పురిటిగడ్డ బుట్టాయగూడెంలో మొదటిసారిగా సిపిఎం జిల్లా మహాసభ జరుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సిపిఎంకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, మునిగిపోతున్న లక్ష కుటుంబాల మాటేంటని ప్రశ్నించారు. పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం జరగాలని చట్టాలు చెబుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ పది శాతమే పునరావాసం జరిగిందని, మిగిలిన 90 శాతం పరిస్థితి ఏమిటో చెప్పడం లేదన్నారు. పునరావాస ప్యాకేజీ లేదు, 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ లేదు, పోడు భూములకు పరిహారం లేదని అన్నారు. మూడేళ్లుగా ఎన్నో కీలక పోరాటాలు సాగాయన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వాన 'పోలవరం పోరుకేక' పాదయాత్ర విజయవాడ వరకు సాగిందన్నారు. 1/70 చట్టం, పీసా చట్టం అమలు చేయాలన్నారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ గిరిజనులకు వ్యతిరేకంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఎల్‌టిఆర్ భూములపై పోరాడుతున్న గిరిజనులపై కేసులు పెడుతున్నారన్నారు. జిల్లాలో 5.75 లక్షల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఎర్రకాలువ భూములు, పంగిడిగూడెం సీలింగ్ భూములు, టి.నరసాపురంలో సైతం పెద్దఎత్తున భూములు భూస్వాముల చేతిలో ఉన్నాయన్నారు. స్కీమ్ వర్కర్లు, భాషా వాలంటీర్లకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కరెంట్ ఛార్జీలు భారీగా పెరిగిపోయాయన్నారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

భూమితోనే అన్ని సమస్యలకూ పరిష్కారం

ముఖ్య అతిథులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల గురించి ఆలోచించడం లేదని, కార్పొరేట్లకే సహజ వనరులతోసహా దోచిపెడుతున్నారని అన్నారు. కేరళలో రూ.700 కూలి ఉందని, ఇంకా ఎక్కడైనా అమల్లో ఉందా అని ప్రశ్నించారు. ఆడపిల్లలకు రక్షణ లేదన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినా ప్రధాని నోరు మెదపలేదన్నారు. 85 శాతం ఎంపీలు వందల, వేల కోట్ల ఆస్తిపరులన్నారు. మోడీ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేశారని, గంగవరం పోర్టు అదానీకి కట్టబెట్టారన్నారు. త్వరలో పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని పెద్దఎత్తున పోరాటం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఆదివాసీలను పట్టించుకోవడం లేదని, ఏజెన్సీ ప్రాంతం కొత్త జిల్లాగా ఏర్పాటైతే సమస్యలు పరిష్కారం ఉంటుందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో భూపోరాటాలతో పది వేలకుపైగా ఎకరాలను స్వాధీనం చేసుకున్నామని, ఇంకా దాదాపు 50 వేల ఎకరాలు గిరిజనేతరుల చేతుల్లోనే ఉందని అన్నారు. జీలుగుమిల్లిలో ఆయిల్ కర్మాగారం పెడితే ప్రభుత్వం సంగతి తేలుస్తామని హెచ్చరించారు. ఎంఎల్‌ఎ గిరిజన హక్కులను కాలరాసి గిరిజనేతరులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. పోడు భూములకు టిడిపి అయినా, వైసిపి అయినా పట్టాలివ్వరని, పట్టాల కోసం ఉద్యమాలు సాగించాలన్నారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి, భాషా వాలంటీర్ల సమస్యలపైనా భూపోరాటాలు సాగించాలని యువతకు పిలుపునిచ్చారు. పోరాటాలు సాగితే భూమి పట్టా అన్నీ వస్తాయన్నారు. భూమితోనే చదువు, ఇల్లు అన్నీ వస్తాయన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఇక్కడ భూ పోరాటాలు సజీవంగా ఉన్నాయన్నారు. ఐటిడిఎ, తహశీల్దార్ కార్యాలయాలు గిరిజనుల కోసం పని చేయడం లేదన్నారు. ఎర్రజెండా పోరాటాలతోనే భూములు సాధించుకున్నామని తెలిపారు. గిరిజనులకు అండగా ఎర్రజెండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డివిఎస్‌వి.ప్రసాద్, జి.రాజు, తెల్లం రామకృష్ణ, నాయకులు తెల్లం దుర్గారావు, కారం భాస్కరరావు, ఎం.జీవరత్నం, ధర్మల రమేష్, ఎం.సుధారాణి, వి.శ్రీను, నాగేంద్రరావు, అందుగుల ఫ్రాన్సిస్, జి.వెంకట్రావు, పి.సూర్యారావు, రాంబాబు, రామముత్యాలమ్మ, కృష్ణారావు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై వినతులు.. ★ ★ ★

వేలేరుపాడు మండలం చిగురుమామిడికి చెందిన పోలవరం నిర్వాసితులు తమ సమస్యలపై సిపిఎం నేతలకు వినతిపత్రం అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న కోయ భాషా వాలంటీర్లు తమ వేతనాల సమస్యపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలతోపాటు కోయ భాషా వాలంటీర్ల సమస్యలపై పోరాటం సాగిస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నేడు, రేపు ప్రతినిధుల సమావేశాలు.. ★ ★ ★

జిల్లా మహాసభ రెండో రోజు శనివారం ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. శని, ఆదివారాల్లో సాగే ఈ సభలో జిల్లాలోని సమస్యలపై చర్చించడంతోపాటు పలు తీర్మానాలను చేయనున్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని మహాసభ ఎన్నుకోనుంది.

బహిరంగ సభకు హాజరైన జనం

ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణీయంగా ఎర్ర చీరలు ధరించి జెండాలు చేతబూనిన మహిళలు

సైబర్ నేరాలపై సమాజాన్ని జాగృతం చేయాలి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా తీసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి మోసాలకు ప్రజలు గురి కాకుండా సమాజాన్ని జాగృతం చేసే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పోలీసు, గ్రామదీప్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించనున్న స్టూడెంట్ అంబాసిడర్ పబ్లిక్ సేఫ్టీ ట్రైనింగ్ వర్క్ షాపును ఎస్‌పి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగతున్నాయన్నారు. సాంకేతికతను ఆసరాగా తీసుకుని కొందరు సైబర్ నేరాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఇటువంటి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచి సైబర్‌నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి సమాజంలో మరింత మందికి తెలియజేసే అంబాసిడర్లు కావాలన్నారు. ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రతాపరమైన సైబర్ నేరాలపై ప్రతిఒక్కరిలో అవగాహన కలిగించాలన్నారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఒటిపిలు చెప్పరాదన్నారు. యాప్, మెసేజ్ లింకులపై టచ్ చేయరాదన్నారు. సైబర్ నేరగాళ్లు పంపే అనుమనాస్పద కాల్స్, మెసేజ్, ఈమెయిల్ లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటువంటి వాటిపై cybercrime.gov.inలో తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం అందించాలన్నారు. మహిళలపై, చిన్నపిల్లలపై నేరాలకు విశృంకత పాశవికమైన ఆలోచన విధానాల వల్ల ఇటువంటివి చోటు చేసుకుంటున్నాయని, వీటిని అరికట్టడం చట్టాల ద్వారానే కాకుండా మనుషుల మనస్సుల్లో మార్పు రావాలన్నారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని, అదే విధంగా బాల్యవివాహాలను చేసే వారిపై, ప్రోత్సహించేవారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఆకతాయిలు వేధిస్తే వెంటనే అదుపు చేసేందుకు, మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు అభయ మహిళా రక్షక దళాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు కచ్చితంగా సీట్ బెల్ట్ ధరించాలని చెప్పారు. ఈ విషయంపై కూడా ముందస్తుగా తమ తల్లిదండ్రులకు అవగాహన పర్చడంతోపాటు సమాజంలో ప్రతిఒక్కరికీ విద్యార్థులు అవగాహన పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముందుగా తమ తండ్రులతో హెల్మెట్ ధరింపచేసి సంబంధిత ఫొటోలను వారి తరగతి గదుల్లో లేదా పాఠశాల నోటీస్ బోర్డులో అమర్చడం ద్వారా మరింతమందిని చైతన్యపర్చవచ్చన్నారు. దొంగతనాలు, ఇతర నేరాల అదుపునకు ప్రతి ఇంట్లోను, కాలనీల్లోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే దిశగా కూడా విద్యార్థులు తమ తల్లిదండ్రులను, కాలనీవాసులను చైతన్య పరచాలన్నారు. ట్రాఫిక్‌కు సంబంధించిన నిబంధనలను వాహనదారులు పాటిస్తే రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఈ రెండు రోజులు అవగాహనా కార్యక్రమంలో ఆయా కళాశాలలు, విద్యాసంస్థల నుంచి ఎంపికైన 150 మంది విద్యార్థులు శిక్షణలో తెలిపిన అంశాలను పూర్తిస్థాయిలో ఆవళింపు చేసుకొని తమ ద్వారా మిగిలిన వారికి అవగాహన కల్పించే దిశగా కృషి చేయాలని ఎస్‌పి సూచించారు. గ్రామదీప్ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ మనోహరి, భూమిక సంస్థ లీగల్ అడ్వయిజర్ జి.అనుపమ, తెలుగు రాష్ట్రాల సోషల్ సర్వీస్ ప్రతినిధి కె.శాంతారామ్, ఎస్ఇఆర్‌పి ప్రతినిధి సిఎ ప్రసాద్, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, సైబర్ సెల్ ఎస్ఐ మధువెంకటరాజా, మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ వి.కాంతిప్రియ, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పలువురు పోలీస్ అధికారులు, వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

సిఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

ఈ నెల 16వ తేదీన సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సిఎం పర్యటనా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. ఆయన వెంట జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగకృష్ణ, మండలాధ్యక్షులు గునపర్తి చిన్ని, బుట్టాయగూడెం మండలాధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్ తెలగంశెట్టి రాము, జల వనరుల శాఖ అధికారులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు : ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవా సదన్ భవనంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగిన ఎల్‌ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని నూజివీడు పట్టణంలోని ఎల్‌ఐసి కార్యాలయం వద్ద ఎల్‌ఐసి ఏజెంట్లు నిరసన తెలిపారు. యాజమాన్య నిరంకుశ వైఖరికి నిరసనగా రెస్ట్ డేను రెండో రోజు శుక్రవారం పాటించారు. ఎల్‌ఐసి ఏజెంట్లు స్వచ్ఛందంగా లావాదేవీలు నిలిపివేశారు. ఈ సందర్భంగా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) కార్యదర్శి నాగమల్లి కుమార్, అధ్యక్షులు మలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లా బాక్ కమిషన్ రద్దు చేయాలన్నారు. ఏజెంట్లకు పాత పద్ధతిలో కమిషన్ ఇవ్వాలన్నారు. ఎల్‌ఐసి పాలసీలపై జిఎస్‌టిని తక్షణమే రద్దు చేయాలన్నారు. పాలసీదారులకు మినిమం ఏజ్, ఏజెంట్ ఇన్సూరెన్స్‌లకు ఏజ్ పెంచాలన్నారు. ఏజెంట్లందరికీ మెడిక్లెయిమ్ వర్తింపజేయాలన్నారు. ఏజెంట్ల ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసి ఏజెంట్లు

పాఠశాలలో విద్యార్థులు

కోలుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని కోటపాడు గ్రామంలోని పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులు కోలుకుని శుక్రవారం పాఠశాలకు వెళ్లారని ఎంఇఒ వివిఎస్‌వి.బ్రహ్మాచారి తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్నాక అస్వస్థతకు గురైన తొమ్మిది మంది విద్యార్థులు నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వారందరూ కోలుకుని శుక్రవారం యధావిధిగా పాఠశాలకు వెళ్లినట్లు ఎంఇఒ తెలిపారు. ఉదయం ఆసుపత్రిలో విద్యార్థులను డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ పరామర్శించారు. జిల్లా సర్వైలెన్స్ ఆఫీసర్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట పాత్రలను, వాటర్ ట్యాంకును, వాటర్ ప్యూరిఫైయర్‌ను పరిశీలించారు. పాఠశాలలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు.

రూ.512.32 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరు :2024-25 ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి నేటి వరకు 240 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 28,851 మంది రైతుల నుంచి రూ.512.32 కోట్ల విలువైన 2,22,876.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. రైతులు కోరిన రైస్ మిల్లులకు 71,23,817 గోనెసంచులను తరలించేందుకు 2,260 వాహనాలను వినియోగించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.512.32 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా అందులో ఇప్పటి వరకు రూ.403.32 కోట్లను రైతుల ఆధార్ అనుసంధానిత ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.101.69 కోట్లు జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ఆసక్తి గల రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించకపోతే ధాన్యం కొనుగోలు కేంద్రంలోని సిబ్బంది ఎఫ్ఎక్యు నిభంధనల ప్రకారం కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైసు మిల్లుకు తరలించి రైతు అధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయాల్లో జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, టోల్ ఫ్రీ 18004256453 ద్వారా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు.

సైబర్ సెక్యూరిటీలో అవకాశాలపై వర్క్‌షాపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సైబర్ సెక్యూరిటీ ట్రెండ్స్‌లో అవకాశాలపై సిబిడాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటర్) హైదరాబాద్ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్‌జియుకెటిలో శుక్రవారం వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాపులో సి-డాక్ శాస్త్రవేత్త ఎం.కుమార్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ ప్రాముఖ్యత, బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి వివరించారు. అలాగే సి-డాక్ వారు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కల్పించే ఇంటర్న్‌షిప్, శిక్షణ కార్యక్రమం, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లకు సంబంధించిన 700 మంది విద్యార్థులు, విశ్వవిద్యాలయ ప్రముఖులు పాల్గొన్నారు.

వర్క్‌షాపునకు హాజరైన విద్యార్థులు

ఎఆర్ డిఎస్‌పిగా చంద్రశేఖర్ బాధ్యతలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎఆర్ డిఎస్‌పి బి.చంద్రశేఖర్ అన్నారు. జిల్లా ఎఆర్ డిఎస్‌పిగా ఆయన శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన కాకినాడ ఎఆర్ డిఎస్‌పిగా నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఏలూరు జిల్లాకు వచ్చారు. ఏలూరు జిల్లాలో ఎఆర్ డిఎస్‌పిగా పని చేస్తున్న హరి కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. 1991 ఎఆర్ ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన చంద్రశేఖర్ ఎఆర్ డిఎస్‌పిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత గుంటూరు, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, మచిలీపట్నం ప్రాంతాల్లో పనిచేశారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ఎస్‌పితో ఎఆర్ డిఎస్‌పి



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

వినియోగదారుల ఉద్యమం బలోపేతం కావాలి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఆర్ఆర్.పేటలో విష్ణు సాయి రెసిడెన్సీలో శుక్రవారం కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్) కన్వీనర్, న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో సెడ్కాస్ కన్వీనర్ మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల ఉద్యమం బలోపేతం చేయాలని, ఆహార పదార్థాలు కల్తీలను, తూనికలు, కొలతల మోసాలను వినియోగదారులుగా ప్రతిఒక్కరు ప్రశ్నించాలని, ప్రతి గ్రామంలో, మండలంలో, నగరాల్లో పౌరులు వినియోగదారుల సంఘాలుగా ఏర్పడి, జరుగుతున్న మోసాలను అరికట్టడంలో ముందుకు రావాలని చెప్పారు. వినియోగదారుల ఉద్యమ నాయకులు కో-కన్వీనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులను చైతన్య పరచడం కోసం సెడ్కాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వినియోగదారులుగా రోజు అనేక విషయాల్లో జరుగుతున్న మోసాలకు కారుకులైన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కో-కన్వీనర్ న్యాయవాది సిపిపిఎస్.రామానుజాచార్యులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వినియోగదారుల వారోత్సవాలు స్కూల్ విద్యార్థుల, వినియోగదారుల క్లబ్‌ల సమక్షంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కో-కన్వీనర్లు బంగారు రాజు, రిటైర్డ్ హెచ్‌ఎం మతిద కస్తూరి, వి.రామచంద్రమూర్తి, న్యాయవాది పి.పరమేశ్వరరావు, న్యాయవాది శ్రీనివాసరావు, న్యాయవాది పి.శిరీష తెలిపారు.

ఉపాధ్యాయ సేవే లక్ష్యం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ముసునూరు



రవికుమార్‌కు ప్రశంసపత్రం అందిస్తున్న నేతలు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ సేవలు అభినందనీయమని మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, మండల ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల రాంబాబు అన్నారు. మండలంలోని చింతలవల్లి గ్రామపంచాయతీ పాఠశాలలో ఆయన అభినందిస్తూ సత్కరించారు. మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో వారి సర్వీసును యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారిచే క్రమబద్ధీకరణ చేయించారు. క్రమబద్ధీకరణ ధ్రువపత్రాన్ని, వారి సేవ పుస్తకాలను ఉపాధ్యాయులు లక్ష్మీపతిరావు, దాసులకు అందించారు. సదరు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సేవ చేయడంలో యుటిఎఫ్ ముందుంటుందన్నారు.

అధికారులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నిడమర్రు

పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి రాష్ట్రీయ గ్రామ సౌరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో నిడమర్రు మండల కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ విజయకుమారి మాట్లాడుతూ 2030 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాలను చేరుకోవాని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు మాట్లాడుతూ తాగునీటిని సక్రమంగా వినియోగించుకోవాలని, ప్రతి గ్రామాన్ని ఒడిఎఫ్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'ఉపయోగం లేని రెవెన్యూ సదస్సులు'

ప్రజాశక్తి - కుక్కునూరు

ముంపు మండలాల్లో రెవెన్యూ సదస్సుల వల్ల ఉపయోగం లేదని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ అన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నెమలిపేట, గుండుగూడెం, గుండంబోరు, అర్వాయిపల్లి గ్రామాల్లో గ్రామ శాఖ కమిటీల సమావేశాలు పార్టీ మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన గౌస్ మాట్లాడుతూ ముంపు మండలాల్లో రెవెన్యూ సదస్సుల వల్ల ఉపయోగం లేదని ఎస్‌కె.గౌస్ అన్నారు. ఈ సమస్యను కలెక్టర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పోలవరం ఎంఎల్ఎ ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ పార్టీ కార్యదర్శి సోయం చంద్రావు, డివిజన్ మండల నాయకులు ఎస్‌కె.మున్ని, కె.దుర్గాప్రసాద్, ముత్తయ్య, కె.వెంకటేశ్వర్లు, పి.బాబూరావు, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో ఎంపిపి రామిశెట్టి దంపతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి



స్వామివారి ఫొటో అందిస్తున్న అర్చకులు

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగ రాయపాలెం-చేవూరు పాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు శుక్రవారంతో ఎనిమిదో రోజుకు చేరాయి. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఎంపిపి దంపతులకు స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామివారి ఫొటో అందించారు. ఎన్‌డిఎ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాదాలు, స్వామి వారి ఫొటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బస్సు టైర్ పేలి ప్రయాణికునికి గాయాలు

ప్రజాశక్తి- ముదినేపల్లి

బస్సు టైరు పేలి ప్రయాణికునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం... గుడివాడ ఆర్‌టిసి డిపోకు చెందిన పల్లె వెలుగు ప్రయివేట్ బస్సు శుక్రవారం గుడివాడ నుంచి కైకలూరు వెళ్తుంది. ఉదయం 10.30 గంటల సమయంలో గుడివాడ రైల్వే గేట్ సమీపంలో అలంకృత ఫంక్షన్ హాల్ వద్దు అకస్మాత్తుగా బస్సు టైర్ పేలింది. ఈ ప్రమాదంలో మండలంలోని దాకారం గ్రామానికి చెందిన అందుగుల వెంకటేశ్వరరావు(65) అనే వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధుని కాళ్లు విరిగిపోయాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో క్షతగాత్రుని ఇవిఆర్ హాస్పిటల్‌కి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణం బస్సు ఫిట్‌నెస్ లేకపోవడం, బస్సు ఓనర్, డిపో మేనేజర్ నిర్లక్ష్యమేనని క్షతగాత్రుల బంధువులు ఆరోపిస్తున్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీ కొనడంతో ఇద్దరు గాయాలపాలైన ఘటన స్థానిక సిటిఆర్ఐ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పి.రాజవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా స్థానిక సిటిఆర్ఐ వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

విల్లంబులు, గిరిజన సంప్రదాయ వేషధారణలో...

మాట్లాడుతున్న తెల్లం రామకృష్ణ

సిపిఎం జిల్లా మహాసభ చిత్రమాలిక

మాట్లాడుతున్న ఎం.నాగమణి

ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కళారూపం



నేతలకు వినతి అందిస్తున్న కోయభాషావాలంటీర్లు

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నేడు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ టిఎస్.సాయిబాబా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు భూమి పన్ను చెల్లించిన రశీదు కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కు కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బితో పాటు ఆధార్ కార్డు తీసుకుని ఎన్నికల కేంద్రానికి ఉదయం ఎనిమిది గంటలకు రావాలని ఆయన తెలిపారు. టి.నరసాపురంలో నందమూరి విద్యాసాగర్ చెరువు ఎన్నికల అధికారిగా ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు, మక్కినవారిగూడెం జమ్మి చెరువు ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామకృష్ణ, తిరుమలదేవిపేట లక్ష్మీనరసింహాసాగర్ చెరువు ఎన్నికల అధికారిగా మండల విస్తరణ అధికారి శ్రీనివాసరావు, అప్పలరాజుగూడెంలో అప్పలరాజు చెరువుకు ఎన్నికల అధికారిగా ఉద్యాన శాఖాధికారి లఖ్పతి విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

దెందులూరు : దెందులూరు నియోజకవర్గ పరిధిలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు మండలాల్లో నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయా మండలాల తహశీల్దార్ల ఆధ్వర్యంలో చేపట్టారు. ఒక్కో నీటి సంఘం పరిధిలో నాలుగు నుంచి 12 వరకు టిసి మెంబర్లు ఉన్నారు. ఎక్కువ చోట్ల ఏకగ్రీవాలే జరగనున్నాయి. అధికార పార్టీ ఎంఎల్‌ఎలు సూచించిన వారే పోటీలో ఉన్నారు. దీంతో ఏకగ్రీవాలే జరిగే అవకాశం ఉంది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు పాఠశాలల్లో ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం ఆయా కేంద్రాలను తహశీల్దార్లు పరిశీలించారు.

ముసునూరు : నేడు జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు, అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను తహశీల్దార్ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పోలింగ్ కేంద్రానికి ఓటు వేయటానికి వచ్చే సమయంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే సమయంలో రెవెన్యూ వారిని, పోలీసు వారిని సంప్రదించాలని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

పంచాయతీ కార్యదర్శుల ఉంగుటూరు మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలు, 25 సచివాలయాల్లో ప్రస్తుతం ఉన్న కార్యదర్శులతో కొత్తగా కార్యవర్గాన్ని ఎన్నుకుని వాటి జాబితాను ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్‌కు అందించారు. కమిటీ గౌరవ అధ్యక్షునిగా బాదంపూడి కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్, అధ్యక్షునిగా నారాయణపురం కార్యదర్శి నేతల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గోపీనాథపట్నం కార్యదర్శి పి.ధనలక్ష్మి, కోశాధికారిగా ఉంగుటూరు కార్యదర్శి బొడ్డు రవిచంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా యర్రమిల్లిపాడు కార్యదర్శి జి.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎంపిడిఒ అభినందించారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదగొన్నూరు గ్రామ పంచాయతీ శివారు విశ్వనాద్రిపాలేనికి చెందిన జీవరత్నం కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందారు. జీవరత్నం మృతి చెందిన విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి రూ.ఐదు వేలు దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పరసా ఏడుకొండలు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విజయవాడలో ముఖ్యమంత్రి పాల్గొనే స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమానికి ఆగిరిపల్లి మండలం నుంచి పెద్దఎత్తున స్వయం సహాయక సంఘ సభ్యులు బస్సుల్లో తరలివెళ్లారు. టిడిపి మండల నాయకులు చిట్నేని శివరామ కృష్ణ జెండా ఊపి బస్సులను తరలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, వెలుగు ఎపిఎం డి.రాజశేఖర్, గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, మహిళా సమాఖ్య సభ్యులు, విఒఎలు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

'టిడిపి సభ్యత్వం నమోదు చేసుకోండి'

చింతలపూడి: ప్రతిఒక్కరూ టిడిపి సభ్యత్వం కట్టుకోవాలని, ప్రగడవరం పంచాయతీని మొదట స్థానంలో ఉంచాలని ప్రగడవరం మాజీ ఎంపిటిసి కనమత రెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పొనుకుమాడులో టిడిపి సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, ప్రసాద్, ఉదయ్, ఏసు, శ్రీను పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో చింతలపూడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

విలువిద్య పోటీల్లో రాణించిన విద్యార్థులు

ఈ నెల 12వ తేదీన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమండ్రి వారు నిర్వహించిన అంతర కళాశాలల విలువిద్య పోటీల్లో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బాలురు, బాలికల విభాగాల్లో ఆధిపత్యం కొనసాగిస్తూ టీమ్ ఈవెంట్లో ప్రథమ స్థానం నిలిచి టీమ్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర తెలిపారు. వ్యక్తిగత విభాగంలో వరుసగా గోల్డ్, సిల్వర్ బ్రాంచ్ మెడల్స్ సాధించి ఆరుగురు విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యారు. ఈ ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కిడ్స్ యూనివర్సిటీ భువనేశ్వర్, ఒడిశాలో జరిగే ఆలిండియా విశ్వవిద్యాలయాల ఆర్చరీ పోటీల్లో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, అధ్యాపక బృందం అభినందించారు.

ప్రతి భూసమస్యకూ రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రతి భూ సమస్యకూ రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం లభిస్తుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. పట్టిసీమ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శిస్తుందని తెలిపారు. అనంతరం గూటాల గ్రామంలోనే భక్తాంజనేయ స్వామి వారి సప్త షష్టి 67వ వార్షిక ఉత్సవాల్లో పాల్గొన్నారు.

టి.నరసాపురం : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ టిఎస్.సాయిబాబా తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు.

దెందులూరు: ఏలూరు మండలం మల్కాపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏలూరు గ్రామీణ తహశీల్దార్ అంతర్వేది శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి హాజరయ్యారు. సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని ఏలూరు రురల్ తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ముదినేపల్లి : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని వణుదుర్రు గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ గ్రామసభలో వివిధ భూ సమస్యలపై 18 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

ఆగిరిపల్లి : రైతులు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణవరంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 14 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమ్మిలి జ్యోతి రాంబాబు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ పి.మరియన్న, మండల సర్వేయర్ గంగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యూనస్, విఆర్ఒ పి.శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మౌనికకు పలువురి అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 11, 12 తేదీల్లో ఎస్‌ఆర్‌ఆర్ జిసిపిఇ గోపన్నపాలెంలో జరిగిన యూనివర్సిటీ కోకో మహిళల టీమ్ సెలక్షన్స్‌లో పాల్గొన్న కె.మౌనిక బిఎస్‌సి హార్టికల్చర్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైంది. ఈ జట్టు ఈ నెల 27వ తేదీ నుంచి 31 వరకు జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల కోకో పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి పాల్గొంటుంది. ఆ జట్టులో స్థానం సంపాదించిన మౌనికాను కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, అధ్యాపక బృందం అభినందించారు.

సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - పెదవేగి

రోజురోజుకు అంతరించిపోతున్న ఇంధన వనరులకు ప్రత్యామ్నాయం చేస్తూ భావితరాలకు మెరుగైన సహజ వనరులను, కాలుష్య రహిత సమాజాన్ని అందించటంలో ప్రతిఒక్కరూ సామాజిక భాద్యతగా భావించి చొరవ చూపాలని, సౌరశక్తిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అందుకు పిఎం సూర్య ఘర్ యోజన పథకం ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని దుగ్గిరాల గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌర శక్తిని వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా కలిగే లాభాలను, పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా లభించే సబ్సిడీ, లోన్ తదితర లబ్ధిని విద్యుత్ శాఖాధికారులు గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో పిఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని అమలు చేయడానికి మొదటగా దుగ్గిరాల గ్రామపంచాయతీని మోడల్ విలేజ్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. రానున్నరోజుల్లో దుగ్గిరాల గ్రామాన్ని నూరు శాతం సౌరశక్తిని వినియోగించుకునే గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వినియోగదారులకు అమర్చే సౌర పలకలను వాటికి సంబంధించిన విభాగాలను పూర్తి సమర్థతతో కలిగిన పరికరాలను వినియోగించేలా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మరమ్మత్తుల విషయంలో కూడా ఎప్పటికప్పుడు సాంకేతిక సిబ్బంది గ్రామస్తులకు అందుబాటులో ఉండే విధంగా కూడా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. గ్రామంలో నూరు శాతం సౌర విద్యుద్దీకరణ జరగడం ద్వారా దుగ్గిరాల గ్రామపంచాయతీకి కేంద్ర ప్రభుత్వం నుంచి కోటి రూపాయల ప్రోత్సాహక నగదు లభిస్తుందని, తద్వారా గ్రామపంచాయతీని మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు, డిఇ కెఎం.అంబేద్కర్, పెదవేగి ఎడిఎ కృష్ణరాజు, ఇన్‌ఛార్జి ఎఇ రాంబాబు, ఎంపిడిఒ శ్రీనివాస్, తహశీల్దార్ భ్రమరాంబా, గ్రామ సర్పంచి గుంజా క్రీస్తుమణి, పార్టీ పెదవేగి మండలాధ్యక్షులు బొప్పన సుధ, బ్యాంకు అధికారి హనుమంత్‌రాజు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లో ఎంఆర్‌పిఎస్ ఉద్యమం

వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) చేసిన ఉద్యమం జాతీయ స్థాయిలో చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ అన్నారు. పట్టణంలోని చెరుకూరి హీరో మోటార్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన మాదిగ సహోదరుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతులు తెలుగు రాష్ట్రాల్లో ఎబిసిడిలుగా కొనసాగుతున్నాయన్నారు. అదే రీతిగా ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతుల్లో రిజర్వేషన్ వర్గీకరణ కొనసాగాలన్నదే తమ ధ్యేయమన్నారు. ఎస్‌సి కేటగిరీలో సామాజిక తరగతుల వారీగా పరిశీలిస్తే మాదిగ సహోదరులే అధిక శాతం ఉన్నారన్నారు. సామాజిక తరగతిలో అధిక జనాభా కలిగిన మాదిగ సోదరులు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు పొందాలనే స్వార్థం తమకు లేదన్నారు. అన్ని తరగతుల వారు రిజర్వేషన్ ఫలాలు పొందాలన్నదే తమ ధ్యేయమని చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ మంద కృష్ణ చేసిన పోరాటం అనిర్వచనీయం, అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో దళితులు సగర్వంగా తల ఎత్తుకుని జీవించేలా అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఎంఎల్ఎ కొలికిపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్ఎ ఉండవల్లి శ్రీదేవి, ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో శుక్రవారం ఫుడ్ పెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాంతాలకు సంబంధించిన వస్త్రధారణలతో అలరించారు. ఈ సందర్భంగా స్థానిక బట్టువారిగూడెంలో చిల్డ్రన్ లిబర్టీ హోమ్కు ప్రైమరి విద్యార్థులందరూ కలిసి బియ్యం, కూరగాయలు, పండ్లు వివిధ రకాల నిత్యావసర సరుకులను శ్రీ చైతన్య యాజమాన్యం వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి ఉదయ్‌భాస్కర్, జోనల్ ఇన్‌ఛార్జి కవిత రాజేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సురేష్, అకాడమిక్ డీన్ మధుబాబు, ఎఒ రవీంద్ర, ప్రైమరి ఇన్‌ఛార్జి ఝాన్సీ, ప్రీ ప్రైమరి ఇన్‌ఛార్జి రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం మహాసభ సావనీర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేటి పాలకుల విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ అన్నారు. ఏలూరులోని అల్లూరు సత్యనారాయణ భవనం (సిఐటియు)లో శుక్రవారం రైతు కూలీ సంఘం మహాసభ సావనీరు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ మహాసభలు జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరు నగరంలో జరిగాయని, ఈ మహాసభల్లో వక్తలు మాట్లాడిన విలువైన, లోతైన విషయాలను సమగ్రంగా సావనీరు రూపంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గం ప్రచురించిందని తెలిపారు.

ఆదర్శప్రాయులు డొక్కా సీతమ్మ

ప్రజాశక్తి - చింతలపూడి

డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకోవాలని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, నియోజకవర్గ మాజీ కన్వీనర్, ఎఎంసి మాజీ ఛైర్మన్, నియోజకవర్గ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని రాఘవాపురం పంచాయతీలో జనసేన గ్రామ ప్రధాన కార్యదర్శి అడపా శ్రీనివాస్ రాఘవపురంలో ఉన్న ఐదు పాఠశాలల పిల్లలకు, పంచాయతీలో ఉన్న తొమ్మిది అంగన్వాడీ స్కూల్ పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ చిదరాల మధుబాబు, టిడిపి మండల ప్రెసిడెంట్ మాటూరి వెంకటరామయ్య, మాజీ ఎంపిటిసి రాజారెడ్డి, పోతునూరు గ్రామ అధ్యక్షులు వెలుగు వెంకటేశ్వరరావు, రాఘువాపురం పంచాయతీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMAD KALISHA, S/o. Mohammad Azgar Ali, Resident of D.No.17-1-2,Lakshmivarapu peta, Revenue ward No.17, Eluru, Eluru Dist, A.P - 534005. I have changed my Name from **MAHAMMAD KALESHA** (Old name) To **MOHAMMAD KALISHA** (New name) for all practical purposes .

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో, ఏలూరు జిల్లా.

E.P.47/2023

in O.S.365/2021

బిట్వీన్ :
చెన్నం నాగమణి ...D.H.R
మరియు
దారం మధుబాబు వగైరా ...J.D.R
టు
దారం మధుబాబు, S/o.దేవదత్తం, R/o.D.No.6B-12-120, దక్షిణపు వీధి, జలాపరమేశ్వరి కాలనీ, ఏలూరు.

పై E.P లో 1వ JDR యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.**6-1-2025**వ తేదీన అయివున్నది. కావున 1వ JDR ది.**6-1-2025**వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేనిచో వారి పరోక్షంలో తీర్మానించబడును.

Eluru
Dt.13-12-2024
B.Srilakshmi, Advocate
Eluru, Cell: 8019442114